కనకరాజు పులి రాములమీదకి దూకిన జాగా దగ్గరికి వెతుక్కుంటూ వెళ్ళాడు. పగిలిపోయిన లాంతరు కనిపించింది. దగ్గర్లో వున్న తుప్పలన్నీ చిందరవందరగా తొక్కేసి వున్నాయి. నేలమీద పులిగోళ్ళ చారలు. మనిషి తన్నుకున్న జాడలు స్పష్టాస్పష్టంగా మసక వెలుతుర్లో కనిపించాయి. ఒక పొదలో కాఫీ ప్లాస్కు పడుంది. పొదలమీద అక్కడక్కడ నల్లటి మరకలు కనిపించాయి. కనకరాజు వాటిని చేతితో తాకాడు. జిగురు జిగురుగా తగిలింది. కంటికి దగ్గరగా పెట్టుకుని చూశాడు. నెత్తురు. నెత్తురుని చూడగానే రాములు జ్ఞప్తికివచ్చి ఒళ్ళు జలదరించింది. క్షణంసేపు ఆగి తిరిగి సర్దుకొని కొంతదూరం వెతికాడు. పులి శవాన్ని ఈడ్చుకుపోయిన జాడ కనిపించింది. నేలమీద వేళ్ళాడుతున్న శవం కాళ్ళు రాసుకుంటూ వెళ్ళిన జాడలు దారిపొడుగునా కనిపిస్తున్నాయి. బరువును ఈడ్చుకు వెళ్తుండంవల్ల పులి అడుగులు లోతుగా కనిపిస్తున్నాయి. శవాన్ని మెడపట్టుకొని ఈడ్చుకు వెళ్ళింది పులి. దారి ప్రక్కన పొదలమీద, కొమ్మలమీద అక్కడక్కడ నెత్తురు పడింది బొట్లుబొట్లుగా.

అలా బాటలో ప్రక్కనున్న రాళ్ళని, పొదల్ని, నేలమీద జాడల్ని వెతుక్కుంటూ వాటిని అనుసరిస్తూ చాలా చాలా దూరం నడుస్తున్నాడు కనకరాజు తుపాకీని ఏ క్షణానైనా ఉపయోగించడానికి సిద్ధంగా ఉంచుకొని బాగా వెలుగొచ్చేసింది. చెట్లమీద పిట్టలు గోలచేస్తున్నాయి. పొదలమీద పిగిలి పిట్టలు గుంపులు గుంపులుగా ఎగురుతున్నాయి. రానురాను పులి బాటని విడిచిపెట్టి తుప్పల మధ్యనుంచి ఇరుకు బాటగుండా కొండవైపు శవాన్ని ఈడ్చుకు వెళ్ళింది. ఒక దగ్గర పొదల్లో ఇరుక్కొన్న శవాన్ని బలాన్ని ఉపయోగించి లాగినపుడు మనిషి చర్మం పేలికలుగా

